'జగనన్న సురక్ష' విజయవంతం చేయండి





అమరాపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి , అగళి : నరసంబుది సచివాలయంలో మట్లాడుతున్న ఎంఎల్‌ఓ ఓబులేసు, పరిగి: సమావేశంలో పాల్గొన్న అధికారులు

అగళి : మండలంలోని నరసంబుది సచివాలయంలో ఎంఎల్‌ఓ ఓబులేసు జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గ్రహసారథులుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి కుంటుంబానికీ సంక్షేమ పథకాలు అందిచాలన్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్, గ్రహసారథులు ఇంటింటికీ వెళ్లి ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జేఎస్‌సీ కన్వీనర్ శివన్న, నాయకులు కామరాజు, సతీస్, వెంకటస్వామి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలో జూలై 1 నుంచి 30వ తేదీ వరకూ సచివాలయ కార్యదర్శి, వీఆర్వోలు వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ గురుబ్రహ్మ, సచివాలయం కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రొళ్ల: మండలంలోని హులికుంట సచివాలయం ఆవరణలో గురువారం సర్పంచ్ కరియమ్మ, వైఎస్ సర్పంచ్ రవికుమార్ ఆధ్వర్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' పథకం కార్యక్రమంపై సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిగి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి 28 వరకూ చేపట్టనున్న ప్రత్యేక డ్రైవ్‌లో గ్రామ పంచాయతీ స్థాయిలో అర్హత ఉండి వివిధ సర్టిఫికెట్ల కారణంగా లబ్ధి పొందని అర్హులకు న్యాయం చేయడానికి అధికారులే ప్రజల ముంగిటకు వస్తున్నారన్నారు. ప్రధానంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు ఇందులో కీలక బాధ్యతలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏఒక్కరికీ అన్యాయం జరగకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని, ఇందు కోసమే నెల రోజుల పాటూ కార్యక్రమం రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనరసింహం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా పైడేటిలో నిర్వహించిన సమీక్షలో ఎంపీడీఓ సరస్వతి పాల్గొని సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లుకు కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు.

'జగనన్న సురక్ష' పారదర్శకంగా నిర్వహించాలి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, ఎంఎల్‌ఓ రవితేజ్ సూచించారు. గురువారం మణూరు, జీవీపాళ్యం పంచాయతీ కేంద్రాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసాథులు, వలంటీర్లకు జగనన్న సురక్షపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, సమస్యలు, అర్హత ఉండి పథకాలు మంజూరు కాకపోతే వివరాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ సేవలు, పథకాలు, సమస్యలు పట్ల ప్రజలు సంతృప్తి చెందేలా సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ముర్షావలి

మడకశిరరూరల్: ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తానని తహసీల్దార్ ముర్షావలి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. చిత్తూరు జిల్లా రొంపిచెర్లలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయనకు పదోన్నతి కల్పించి ఉన్నతాధికారులు మడకశిర తహసీల్దార్‌గా నియామిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు, ఆర్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రమేష్‌బాబు



అమరాపురం: తహసీల్దార్‌గా రమేష్‌బాబు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సురేష్‌కుమార్ ఇటీవల బదిలీపై సోమందేపల్లికి వెళ్లారు. ఉరవకొండలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న రమేష్‌బాబు పదోన్నతిపై అమరాపురం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

బాధ్యతలు చేపట్టిన జమానుల్లా ఖాన్



అగళి: తహసీల్దార్‌గా టీఆర్ జమానుల్లా ఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ జిలాని 15 రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయానికి ఏఓగా బదిలీ కావడంతో..కంబదూర్‌లో డిప్యూటీ తహసీల్దార్ గా పనిచేస్తున్న జమానుల్లా ఖాన్ పదోన్నతిపై అగళి తహసీల్దార్‌గా వచ్చారు.

నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థి జయప్రకాష్ నీట్ ఫలితాల్లో 7 వేల ర్యాంక్ సాధించాడు. గురువారం ఉదయం ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని ఘనంగా సన్మానించారు. అనంతరం రూ. 5 వేలు నగదు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌మూర్తి, సీనియర్ అధ్యాపకులు సుందరరాజు, వివేకానందరెడ్డి, పాఠశాల కమిటి చైర్మన్ రామాంజినేయులు పాల్గొన్నారు.

నేడు పావగడకు హోం మినిస్టర్ రాక

పావగడ: రాష్ట్ర హోం శాఖా మంత్రి జి.పరమేశ్వర్ శుక్రవారం పావగడలో పర్యటించనున్నట్లు స్థానిక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు గురువారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. స్థానిక తాలూకా పంచాయతీ సమితి సభాంగణంలో ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ సమక్షంలో నిర్వహించే కేడీపీ సమావేశంలో మంత్రి పాల్గొననున్నారు. అనంతరం సాయంత్రం 3 గంటల సమయంలో తిరుమణి సోలార్ పార్క్‌ను సందర్శించ నున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

గ్యాస్ సిలిండర్ వాడకంపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని నాగలూరులో గురువారం గ్యాస్ సిలిండర్ వాడకంపై ఇండేన్ గ్యాస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. సిలిండర్‌ను నిటారుగా ఉంచాలని తద్వారా గ్యాస్ ప్రమాదాలను అరికట్టొచ్చన్నారు. గ్యాస్ స్టౌ నుంచి సిలిండర్‌కు అమర్చే రబ్బర్ ట్యూబ్‌ను తరచూ మార్చాలన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ

కొత్తచెరువు: మండల కేంద్రంలో గురువారం నాలుగు సెల్‌ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కాయగూరల సంత కావడంతో వివిధ గ్రామాల నుంచి ప్రజలు మార్కెట్‌కు వచ్చారు. ఈ క్రమంలోనే నలుగురికి చెందిన సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.



మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: సీ.చెర్లోపల్లిలోని ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ గురువారం పేర్కొన్నారు. 7వ తరగతిలో 20 సీట్లు, 8వ తరగతిలో 26, 9వ తరగతిలో 11 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రోస్టర్ పద్ధతిలో సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'నవోదయ'కు ఎంపిక



విద్యార్థిని ఉదయశ్రీ

గుడిబండ: మండలంలోని ఎంఎస్ తండాగ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఉదయశ్రీ 6వ తరగతి ప్రవేశానికి నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు గురువారం తెలిపారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.

ఓటరు జాబితా సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ హసీనా సుల్తానా

హిందూపురం: నాణ్యమైన ఓటరు జాబితాలను రూపొందించడానికి ఇంటింటి సర్వే చేయాలని నోడల్ అధికారి, సెరికల్చర్ ఏడీ సురేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తహసీల్దార్ హసీనా సుల్తానా అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌ఓ, సహాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మండల, పట్టణ బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటింటి సర్వే కోసం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఓటరు లిస్టు తయారీ కోసం సూపర్‌వైజర్, బూత్ స్థాయి అధికారులకు వర్క్‌షాపు చేపట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లకు ఫారం-6, నుంచి 10 వరకూ వివరాలు తెలియజేయాలన్నారు. ఓటర్ల నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సహాయాధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు దరఖాస్తులు స్వీకరించండి



ఉపాది సిబ్బందితో సమీక్షిస్తున్న ఎంపీడీఓ కల్లుమడిఆజాద్

రొళ్ల: మండల వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఐదెకరాలలోపు భూములు కలిగిన సన్న, చిన్నకారుల రైతుల నుంచి ఉపాధి పథకంలో మెట్ట ప్రాంతంలో పండ్లతోటల పెంపకం కోసం ఈ నెలాఖరులోపు దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీడీఓ ఆజాద్, ఏపీడీ జయసింహ సూచించారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాది సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రొళ్ల మండలానికి 200 ఎకరాలు పండ్లతోటల పెంపకానికి ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారన్నారు. అందులో ఇప్పటి వరకు 60 ఎకరాల్లో సాగుకు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. పండ్లతోటలు మంజూరైన రైతులకు పంట సంరక్షణ కోసం మూడేళ్ల పాటు బిల్లులు చెల్లిస్తామన్నారు. అలాగే పూల తోటల సాగుకు కూడా అవకాశం ఉందన్నారు. ప్రతి పంచాయతీలో 200 మంది కూలీలకు తక్కువ కాకుండా ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఓబుళప్ప, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం ఎదురుచూపు!

పావగడ: తాలూకా వ్యాప్తంగా రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఆకాశంలో నల్ల మబ్బులు వంగినట్లే వంగి గాలికి చెదిరి పోతుండడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గత మే నెలలో కురిసిన చిన్నపాటి వర్షాలకు కొంత మంది రైతులు మాత్రం విత్తనం వేశారు. మిగిలిన రైతులు వేరు శనగ విత్తన కాయ శుద్ధి చేసుకుని, సేద్యం పనులు ముగించుకుని, ఎరువులు సైతం కొనుగోలు చేసి వాన కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. గత మేలో వేసిన విత్తనం వర్షం లేక నేలకంటుకు పోతోంది. జూన్ నెలలోగా చాలా వరకు విత్తన సాగు ప్రక్రియ ముగియాల్సి ఉంది. జూలైలో విత్తనం తప్పని సరి సాగు చేసే అవకాశం ఉంది. తాలూకా వ్యాప్తంగా 29,457 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా కేవలం 1,035 హెక్టార్ల లో విత్తనం వేశారు. కసబా హోబళీలో 255 హెక్టార్లు, నిడుగల్ 634, నాగలమడక 78, వైఎన్ హొసకోట హోబళీలో 68 హెక్టార్లలో విత్తనం వేసినట్లు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ సారి వర్షపాతం జనవరి నుంచి జూన్ 22 వరకు అతి తక్కువగా నమోదైంది. ఇదిలా ఉంటేటే 1,720 క్వింటాళ్ల విత్తన వేరుశనగ గోదాముల్లో నిల్వ ఉండగా 83.8 క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేశా రు.1636.25 క్వింటాళ్ల విత్తన కాయ మిగిలి ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అందులోనూ ఆంధ్రలో కే 6 రకం సబ్సిబీ విత్తన వేరుశనగ క్వింటాల్ రూ.5,580 ధర ఉండగా అదే విత్తన కాయ పావగడలో రూ 7,600 ధర ఉండడంతో రైతులు విత్తన కాయ కొనుగోలుకు విముఖత చూపుతున్నారు.

ఎస్‌గా ఇషాక్‌బాషా బాధ్యతల స్వీకరణ



మడకశిరరూరల్: మడకశిర ఎస్‌ఐగా ఇషాక్ బాషా గురువారం బాధ్యతలను స్వీకరించారు. కదిరి అర్బన్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఇషాక్‌బాషాను జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మడకశిర బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఉన్న ఎస్‌ఐ సురేష్‌బాబు మెడికల్ లీవ్‌లో వెళ్లినట్లు సమాచారం. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యాకలపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

పుట్టపర్తి అర్బన్: ఈనెల 23వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకూ మండలంలోని 8 సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు నోడలాఫీసర్ శివారెడ్డి, ఎంపీడీఓ అశోక్‌కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆధార్ కార్డులు తీస్తారన్నారు. 23న నిడిమామిడి, 24న రాచువారిపల్లి, 26న పెడపల్లి, 27న దిగువచెర్లోపల్లి, 28న జగరాజుపల్లి, 30న వెంగళమ్మ చెరువు, జూలై 3న చెర్లోపల్లి, 4న అమగొండపాళ్యం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 0–5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులందరికీ ఆధార్ తీయించాలన్నారు.

భార్యతో కొట్లాడి.. ఒంటికి నిప్పు

- తుమకూరు జిల్లాలో సంఘటన



ఆస్పత్రిలో బాధితుడు వినోద్

తుమకూరు: భార్యతో గొడవపడి బైక్‌లో నుంచి పెట్రోలు తీసుకుని నిప్పంటించుకున్న భర్త ఆస్పత్రి పాలయ్యాడు. తుమకూరు జిల్లాలోని కొరటిగెరె పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇరకసంద్ర కాలనీలో చోటు చేసుకుంది. వినోద్ (35) హిందూపురంలోని హౌసింగ్‌బోర్డు కాలనీవాసి. తగ్గనహళ్ళిలో ఆశా అనే యువతితో పరిచయమై ప్రేమగా మారింది. పదేళ్ల కిందట ఇరువురూ పెళ్లి చేసుకుని ఇరకసంద్రలో కాపురం పెట్టి కూలీపనులు చేసుకునేవారు. రెండేళ్ల వరకు సంసారం సజావుగానే సాగింది. తరువాత నిత్యం గొడవపడుతూ ఉండేవారు. ఇలాగే బుధవారం రాత్రి 10 గంటలకు కూడా గొడవ జరిగి భార్య పైన కోపంతో తన బైక్‌లో నుంచి పెట్రోల్‌ను పోసుకొని నిప్పు పెట్టుకోవడంతో మంటల్లో చిక్కుకున్నాడు. ఇంతలో భార్య, స్థానికులు అతనిపై మట్టి, నీళ్ల పోసి మంటలను ఆర్పారు. ఆస్పత్రికి తరలించాలని 108 అంబులెన్స్ కోసం ఎన్నిసార్లు ఫోన్ చేసినా రాలేదు. చివరకు ఫ్రెండ్స్ గ్రూప్ అనే సేవా సంస్థ అంబులెన్స్‌ను పిలిపించి రాత్రి 1 గంట సమయంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా బాధితుని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మోటారు, ఇనుము అపహరణ

రొళ్ల: మండలంలోని దొడ్డేరిలో కొత్తగా నిర్మాణం చేపట్టిన సచివాలయం సంపు గుంతకు అమర్చిన 1హెచ్‌పీ విద్యుత్ మోటార్ రెండు సార్లు , 50 కిలోల ఇనుమును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు కాంట్రాక్టర్లు హెక్బల్‌బాషా, నూరుల్లాబాషా గురువారం తెలిపారు. రూ.18 వేలు నష్టపోయామని, చోరీ విషయాన్ని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం హొసకెరెలో ఇనుప కట్టను ఓ వ్యక్తికి విక్రయించినట్లు తెలిసిందన్నారు. పోలీసులు విచారణ చేపట్టి దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి పౌర్ణమి రోజు అరుణాచల దర్శనం

హిందూపురం టౌన్: ఆర్టీసీ ఆధ్వర్యంలో స్థానిక డిపో నుంచి అరుణాచలం దర్శనానికి ప్రతి పౌర్ణమి రోజు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు. అరుణాచలంతో పాటు వేలూరు స్వర్ణదేవాలయం, కాణిపాకం సిద్ది వినాయకుణ్ణి దర్శనం ఉంటుందన్నారు. జూలై 2న పౌర్ణమి రోజున ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు రిజర్వేషన్ కౌంటర్ నంబర్ 8977225997కు సంప్రదించాలని సూచించారు.

కియా ఉద్యోగికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహేష్

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో కియా ఉద్యోగి గాయపడిన సంఘటన తిమ్మాపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కియా పరిశ్రమలోని అసెంబుల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహేష్ బైక్‌పై గురువారం విధులకు హజరయ్యేందుకు బయలుదేరాడు. తిమ్మాపురం క్రాస్ సమీపంలోని దాబా వద్ద ఎదురుగానే ఎదురుగా వస్తున్న ఓ వాహనాన్ని ఎదురుగా ఢీకొన్నాడు. ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

జూదరుల అరెస్టు

పరిగి: పెద్దిరెడ్డిపల్లి శివారు ప్రాంతంలో గురువారం 9 మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. నిందితుల నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి



ఆటోనగర్‌లో మురుగు కాల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం: మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. గురువారం ఇంజినీర్లతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ధన్‌రోడ్డులో ఏఈ నాగేంద్రతో కలిసి రూ.40 లక్షలతో నిర్మిస్తున్న హెల్త్ సెంటర్ నిర్మాణంపై ఆరా తీశారు. ఆటోనగర్‌లో డ్రైనేజీ నిండిపోయి మురుగు నీరు ఇళ్లలోకి వస్తుండటంతో అధికారులతో వెళ్లి పరిశీలించారు. మురుగు నీరు ప్రవహిస్తున్న మట్టి డ్రైనేజీ కాల్వల స్థానంలో వెంటనే మురుగు కాల్వలు నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రహమత్‌బీ, ఇంజిరింగ్ అధికారులు, కంట్రాక్టర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: స్థానిక వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రణవికి రూ.3 వేలు, రెండో స్థానంలో నిలిచిన జశ్వంత్‌రెడ్డికి రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన అలౌకికకు రూ.1000 చొప్పున అందజేశారు. అలాగే ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రులు, పాఠశాల, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకు రావాలన్నారు.

కుటుంబ సభ్యుల అవసరాలు నమోదు చేయాలి

అమరాపురం: వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ అవసరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి భాస్కర్ సూచించారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహ సారథులను కలుపుకుని జూలై 1 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ఇంతవరకూ చేకూర్చిన లబ్ధిని వివరిస్తూ వారికి అందాయా? లేదా? అని అడిగాలన్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే నమోదు చేసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. అలాగే 11 సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తామని లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ఉష, వెల్ఫేర్ అసిస్టెంట్ శివన్న, వలంటీర్లు పాల్గొన్నారు

బెంగళూరుకు చార్జీ రూ.125

హిందూపురం టౌన్: హిందూపురం నుంచి బెంగళూరుకు ఆర్టీసీ బస్సులో ఇకపై రూ.125 చార్జీతోనే ప్రయాణం చేయవచ్చని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు గురువారం పేర్కొన్నారు. ఏపీఎస్ ఆర్టీసీలో హిందూపురం నుంచి బెంగళూరుకు రూ.135లు చార్జీ ఉండేదన్నారు. కేఎస్ ఆర్టీసీలో రూ.126 చార్జీ ఉండటంతో బస్సు చార్జీ మధ్య వ్యత్యాసాన్ని తగ్గించినట్లు వెల్లడించారు. హిందూపురం నుంచి బెంగళూరుకు రూ.125 చార్జీగా నిర్ణయించామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షం రాలేదని దిగులు పడొద్దు



రైతుకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: వర్షం రాలేదని దిగులు పడొద్దని ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ రైతులకు సూచించారు. తాలూకా లోని లింగదహళ్లిలో గురువారం ఏర్పాటు చేసిన విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షం పడ్డాక తప్పనిసరి విత్తనం సాగు చేయాలన్నారు.సబ్సిడీ విత్తన వేరుశనగ ధర ఆంధ్ర కంటే కర్ణాటకలో అధిక ధర ఉందని, వచ్చే ఏడాది ధరల సమస్య పరిష్కరిస్తానన్నారు. లింగదహళ్లి, సాసలకుంటె గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వేరుశనగ కాకుండా లాభదాయక చిరు ధాన్యాల పంటలపై రైతులపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తామన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త వ్యవసాయశాఖ డైరెక్టర్ రవి, కేపీసీసీ సభ్యుడు పాపణ్ణ, స్థానిక వ్యవసాయశాఖాధికారి విజయ మూర్తి, అధికారులు సణ్ణ రామిరెడ్డి, కరియణ్ణ, కరియప్ప రెడ్డి, మారణ్ణ, వేణుగోపాలరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి

చిలమత్తూరు: పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని ఏపీడీ శివానంద నాయక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో పండ్ల తోటలకు 150 ఎకరాల లక్ష్యాన్ని కేటాయించారన్నారు. 80 ఎకరాలు సంబంధించి రైతులకు కేటాయింపు పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన 70 ఎకరాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పండ్ల తోటల పెంపకం ద్వారా మూడేళ్ల పాటు వారికి అందించే ఆర్థికసాయంపై వివరించాలన్నారు. అదే విధంగా ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలన్నారు. సొంత గ్రామాల్లోనే ఉపాధి కల్పించడం ద్వారా వలసల నివారణ సాధ్యం అవుతుందన్నారు.

మురుగు నీటి కాలువ సమస్య పరిష్కారం

చిలమత్తూరు: మండలంలోని అంజనీతండాలో తలెత్తిన మురుగునీటి కాలువ సమస్యను ఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం పరిష్కరించారు. కాలువకు స్థలం ఇచ్చే విషయంలో వాగ్వాదం జరగడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మురుగునీటి కాలువకు ప్రతి ఒక్కరూ స్థలం ఇచ్చేలా ఒప్పించి సమస్యను పరిష్కరించారు. గొడవల జోలికి వెళ్లకూడదని సూచించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు.